# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొద్ది సేపటి క్రితం దర్శించుకున్నారు.

- నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేపట్టిన ఆపరేషన్ సంభవ్ లో రాష్ట్ర పోలీస్ బలగాలు సమర్ధవంతంగా పని చేశాయని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు.

- ధాన్యం విక్రయించిన నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.

- ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ శనివారం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొద్ది సేపటి క్రితం దర్శించుకున్నారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటన నిమిత్తం తిరుపతి అంతర్జాతీయ విమానశ్రయానికి చేరుకుని అక్కడ నుండి తిరుచానూరుకు వెళ్లిన రాష్ట్రపతికి రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ ఆలయంలో స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా రేపు ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకుంటారు. తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన ఈరోజు అమ్మవారు కల్పవృక్ష వాహనంపై శ్రీ మురళీకృష్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి వాహనసేవ కన్నుల పండుగగా జరిగింది.

========================

దేశంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయని రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. అందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో చేపట్టిన ఆపరేషన్ సంభవ్ లో భద్రతా

బలగాలు విజయం సాధించాయని వెల్లడించారు. మావోయిస్టుల కీలక నేత మద్వి హిడ్మా, టెక్ శంకర్ సహా 13 మంది ఈ కాల్పుల్లో మరణించారని తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో వేరు వేరు చోట్ల ఆశ్రయం పొందుతున్న 50 మంది వరకు మావోయిస్టులను అరెస్ట్ చేశామని చెప్పారు. జిల్లాలోని రంపచోడవరంలో డీజీపీ ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... వచ్చే ఏడాది మార్చి నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చే దిశగా భద్రతా దళాలు పని చేస్తున్నాయని చెప్పారు. గత రెండు, మూడు రోజులుగా చేపట్టిన ఆపరేషన్  సంభవ్‌లో రాష్ట్ర పోలీస్ బలగాలు సమర్ధవంతంగా పని చేసాయని హరీశ్ కుమార్ గుప్తా అభినందిస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

=======================

ధాన్యం విక్రయించిన నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరు, పాతూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ఈరోజు పరిశీలించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో 3 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

=======================

గోదావరి-నల్లమల సాగర్ అనుసంధానంతో వెనుకబడిన ప్రాంతాల సమ్మిళిత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. 53 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న వెలిగొండ ప్రాజెక్టు నల్లమల సాగర్ రిజర్వాయర్ కి బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా గోదావరి నదీ జలాలను తరలించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... గోదావరి-నల్లమల సాగర్ అనుసంధానంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కనిగిరి, ఎర్రగుండపాలెం, మార్కాపురం, దొనకొండ, మర్రిపూడి, చీమకుర్తి, నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, కడప జిల్లాలోని మైదుకూరు ప్రాంతాలలోని 23 లక్షల మంది ప్రజలకు సురక్షిత తాగునీరు, 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని చెప్పారు. అదే విధంగా అతి ఎక్కువ ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలైన ప్రకాశం, పల్నాడు జిల్లాలలో సురక్షిత తాగు నీటిని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించవచ్చని లంకా దినకర్ పేర్కొన్నారు.

=======================

విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 22వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ డ్వామా పథక సంచాలకులు ఎస్.శారద దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథక వేతనదారులు, గ్రామస్తులు, గ్రామ ప్రజా ప్రతినిధులు ఈ సభల్లో పాల్గొని.. ఆ పథకం అమలులో ఉన్న అవకాశాలను

సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సభల్లో కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ, పని కోసం నమోదు, తొలగింపుకు కారణమైన జాబ్ కార్డుల పరిశీలన, అర్హులైతే పునరుద్ధరణ వంటివి చేపడతారని తెలియజేశారు.

========================

ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఇది ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి ఈనెల 24న దక్షిణ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ తెలిపారు. ఆ తదుపరి 48 గంటల్లో ఇది పశ్చిమ-వాయువ్య దిశగా ప్రయాణించి నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే ఆవకాశం ఉందన్నారు. ఇక నైరుతి బంగాళాఖాతం దాని పరిసరాల్లో ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం ఈరోజు తక్కువగా గుర్తించబడిందని చెప్పారు. వీటి ఫలితంగా రాష్ట్రంలో కొన్ని చోట్ల రేపు తేలిక పాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని మెట్రాలజిస్ట్ బి. శేఖర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 17 సెకన్లు)

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ రేపు పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్ ఆధ్వర్యంలోని కమిటీ రేపు ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఐటీడీఏ కమ్యూనిటీ హాల్ లో షెడ్యుల్డ్ కుల సంఘాల ప్రతినిధులను కలుస్తుందని, వారి నుండి వినతులను స్వీకరిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా అధికారులతో కలెక్టరేట్ లో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా ప్రజా సంఘాల నాయకులు, ప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ తెలియజేశారు.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 186 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 446 పాయింట్ల లాభంతో 85 వేల 632 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 139 పాయింట్ల లాభంతో 26 వేల 192 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 71 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.14 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 063 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

========================
========================